**ఆకాశవాణి హైదరబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 02.05.2026** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఆర్టీసీ మనుగడ కోసం గాజులరామారం, బహదూర్‌గూడల్లో భారీ బస్ టెర్మినళ్ల నిర్మాణానికి భూములు కేటాయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.
2. ఈ నెల 10న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా 'పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్'ను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.
3. పార్టీ బలోపేతం, కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక భేటీ నిర్వహించారు.
4. తెలంగాణకు ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో 4 వేల 621 కోట్ల జీఎస్టీ ఆదాయం సమకూరింది. అన్ని విభాగాల జీఎస్టీతో కలిపి రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది

..............................................................

**రేవంత్‌రెడ్డి ఆర్టీసి**

రాష్ట్రంలో ఆర్టీసీని బలోపేతం చేస్తూ కార్మికుల సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్టీసీ మనుగడ కోసం గాజుల రామారం, బహదూర్ గూడల్లో భారీ బస్ టెర్మినళ్ల నిర్మాణానికి భూములు కేటాయించినట్లు వెల్లడించారు. సమ్మె కాలపు వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతతో పాటు వేతన సవరణపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా సంస్థ ఆదాయం పెరిగిందని, నియామకాలు చేపడుతూ ఒక్క ఉద్యోగిని కూడా తొలగించబోమని స్పష్టం చేశారు.

తమ సమస్యలపై స్పందించినందుకు కార్మిక సంఘాల నేతలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

.......డెస్క్

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో జరిగిన యోగా దినోత్సవ కౌంట్‌డౌన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా 'పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్'ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వెయ్యి 327 ఎకరాల్లో ఒక వెయ్యి 695 కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ పార్క్ దేశంలోనే అతిపెద్దదిగా నిలవనుందన్నారు. 'ఫామ్, ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్,ఫారిన్' అనే ఐదు F మంత్రలో టెక్స్ టైల్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించారని తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా వస్త్ర ఉత్పత్తి, ఎగుమతులను పెంచి భారీగా ఉపాధి కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఇప్పటికే 3 వేల 800 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇది వరంగల్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుందని మంత్రి వెల్లడించారు.

......డెస్క్

**ఆత్మనిర్భర్ పంచాయత్**

రాజేంద్రనగర్‌లోని NIRD & PR వేదికగా, కేంద్ర రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మనిర్భర్ పంచాయత్ కార్యక్రమం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించినప్పుడే సర్పంచ్‌లకు నిజమైన గుర్తింపు లభిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పలువురు అధికారులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

......పిటిసి, హైదరాబాద్

**డికే అరుణ**

రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడారు... ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 10న రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో రాష్ట్రంలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ...

**బైట్ ... డికే అరుణ**

10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలన రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆ రెండు పార్టీలపై ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు.

.....పిటిసి, మహబూబ్ నగర్

**నీట్-యుజి 2026**

వైద్యవిద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యుజి 2026 పరీక్షకు తెలంగాణలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 24 పట్టణాల్లోని 199 కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది. తెలంగాణ నుండి సుమారు 73 వేల 084 మంది విద్యార్థులు హాజరుకానుండగా, హైదరాబాద్‌లోనే అత్యధికంగా 69 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల తర్వాత ఎవరినీ అనుమతించరని, అభ్యర్థులు నిబంధనలు, డ్రెస్ కోడ్ పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా కమిటీలు, బయోమెట్రిక్, ఫేస్ అథెంటికేషన్ వంటి కట్టుదిట్టమైన భద్రతా చర్యల మధ్య పరీక్షా ప్రక్రియను పర్యవేక్షిస్తాయి. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

........డెస్క్

**సీపీ సజ్జనార్**

నీట్ పరీక్షల నేపథ్యంలో మేనేజ్మెంట్ కోటా సీట్ల పేరుతో మోసగించే దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సజ్జనార్ హెచ్చరించారు. వైద్య వృత్తిపై ఉన్న ఆసక్తిని ఆసరాగా చేసుకుని, తక్కువ మార్కులు వచ్చినా విదేశాల్లో లేదా స్థానికంగా సీట్లు ఇప్పిస్తామని నమ్మించే ముఠాల బారిన పడవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. సీట్ల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

......డెస్క్

**నీట్ పరీక్ష - నల్గొండ**

నల్లగొండ జిల్లాలో రేపు నిర్వహించనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ తెలిపారు. నీట్ పరీక్షల కోసం జిల్లాలో 2038 విద్యార్థుల కోసం 6 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే నీట్ పరీక్షకు ఉదయం 11 నుండి 1.30 గంటల వరకు బయోమెట్రిక్, స్క్రీనింగ్, అడ్మిట్ కార్డు వెరిఫికేషన్స్ ఉంటుందని తెలిపారు.

.......పిటిసి, నల్గొండ

**కేటీఆర్ నేతలతో సమావేశం**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారక రామారావు తన నివాసంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమం, కమిటీల నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చించారు.

....పిటిసి, రంగారెడ్డి

**తెలంగాణ - జీఎస్టీ ఆదాయం**

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, ప్రభుత్వ పటిష్ట చర్యల వల్ల ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో 4 వేల 621 కోట్ల రూపాయల జీఎస్టీ ఆదాయం సమకూరింది. గత ఏడాదితో

పోలిస్తే ఇది 35 శాతం వృద్ధి కావడం విశేషం. అన్ని విభాగాల జీఎస్టీ కలిపి 7 వేల 181 కోట్ల రూపాయలతో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. మద్యం, పెట్రోల్ వ్యాట్, వృత్తి పన్నులతో కలిపి మొత్తం ఆదాయం 7 వేల 570 కోట్ల రూపాయలకు చేరి 22 శాతం వృద్ధిని నమోదు చేసింది.

.....డెస్క్

**పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు శంకుస్థాపన చేశారు. చిన్న బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ...

**బైట్ ... పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

.......పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**రాజన్న సిరిసిల్ల**

కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పంచాయతీ అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్ లో రాజన్న సిరిసిల్ల, వెంకటంపల్లి గ్రామపంచాయతీ రెండు విభాగాల్లో ఎంపికైంది. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీగా 96.67 స్కోర్ తో A+ గ్రేడ్, సోషల్లీ జస్టిస్ విభాగంలో 88.82 స్కోర్ తో A గ్రేడ్ సాధించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి బండారి మనిషా, గ్రామ సర్పంచ్ ఆవునూరి లక్ష్మి లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఆకాశవాణితో మాట్లాడుతూ...

**బైట్ ...** గ్రామ పంచాయతీ కార్యదర్శి బండారి మనిషా

గ్రామ సర్పంచ్ ఆవునూరి లక్ష్మి

........పిటిసి, రాజన్న సిరిసిల్ల

**2 కె రన్ - సిరిసిల్ల**

డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్లలో నిర్వహించిన 2 కె రన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలపై

యువతకు అవగాహన కల్పించిన ఆయన, విద్యార్థులు 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా మారి సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

.....పిటిసి, రాజన్న సిరిసిల్ల

**రేవంత్ రెడ్డి విద్యుత్ పై సమీక్ష**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సరఫరా లోపాలను సరిదిద్దేందుకు ఏఐ సాంకేతికతను వినియోగించాలని, ట్రాన్స్ ఫార్మర్లపై భారం పడకుండా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.

......HYD -PTC

**రోడ్డు ప్రమాదం - కేటీఆర్**

శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిన్న ఉస్మానియా ఆసుపత్రి మార్చురీని సందర్శించిన ఆయన, మృతుల భౌతికకాయాలకు నివాళులర్పించి బాధితులను ఓదార్చారు.

......డెస్క్

**పొన్నం ప్రభాకర్**

రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద, ప్రమాదానికి గురైన వాహనాలను ప్రత్యేక వేదికలపై హెచ్చరిక సూచికలతో ప్రదర్శించాలని స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్‌కు సూచించారు.

.....డెస్క్